క్లుప్తంగా

25 నుంచి అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: తాళ్లపాక అన్నమాచార్యుల వారి 522వ వర్ధంతి ఉత్సవాలు ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఘనంగా నిర్వహించ నున్నారు. ఇందులో భాగంగా అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద, తిరుమల నారాయణగిరి ఉద్యానవనం, తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈనెల 25న ఉదయం 6 గంటలకు తిరుపతిలోని అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్సవంతో ఉత్సవాలు ఆరంభమవుతాయి. 26న తిరుమలలో సాయంత్రం 6 గంటలకు నారాయణగిరి ఉద్యానవనంలో సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహిస్తారు. అలాగే 26 నుంచి 29వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు అన్నమాచార్య కళామందిరంలో, తాళ్లపాక ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద సాయంత్రం వేళ ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

23న మాలల సింహగర్జన



మాట్లాడుతున్న రాయలసీమ మాలల జేఏసీ గౌరవాధ్యక్షుడు అశోక్ రత్నం

తిరుపతి కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ పేరుతో చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా ఈనెల 23న తిరుపతిలో భారీస్థాయిలో నిర్వహించే మాలల సింహగర్జనకు రాయలసీమలోని మాలలు, మేధావులు, ఉద్యోగులంతా తరలిరావాలని రాయలసీమ మాలల జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాయలసీమ మాలల జేఏసీ గౌరవాధ్యక్షుడు చెరుకూరి అశోకరత్నం మాట్లాడారు. దళితుల ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు వారి అణచివేతకు ప్రయత్నించడం హేయమైన చర్య అన్నారు. మాలల అణచివేతకు ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామన్నారు. ఇందులో భాగంగా 23న నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మాలల సింహగర్జన నిర్వహిస్తున్నామని, రాయలసీమలోని మాలలు, మేధావులు, ఉద్యోగులంతా తరలివచ్చి పాలకుల మెడలు వంచాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాయలసీమ మాలల జేఏసీ ప్రతినిధులు మల్లారపు మధు, సుదర్శనం, ధనశేఖర్, అజయ్‌కుమార్, మురళి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారి ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.22,75,865 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ ఏ.జయకుమార్ తెలిపారు. బుధవారం హుండీలోని కానుకలను లెక్కించారు. ఇందులో నగదుతో పాటు 24 గ్రాముల బంగారం, 720 గ్రాముల వెండి కానుకలుగా లభించాయి. కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారిగా వినోద్‌కుమార్ హాజరు కాగా సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, ఈస్ట్ పోలీసులు స్వచ్ఛంద సంస్థ సేవకులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం



వెట్టిచాకిరి నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ రామ్మోహన్

తిరుపతి అర్బన్: మానవ అక్రమ రవాణా పెద్ద నేరంగా పరిగణించాల్సి ఉంటుందని తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో రోప్స్ సేవా సంస్థ రూపొందించిన మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ నిర్మూలనకు చెందిన అవగాహన పోస్టర్‌ను తిరుపతి అర్బన్, రూరల్ తహసీల్దార్లు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రమత్తంగా ఉండడం కోసం ఎస్సీ, ఎస్టీల్లో చైతన్యాన్ని నింపాలని సూచించారు. అలాగే వెట్టిచాకిరి చేయించుకోవడం సైతం నేరంగా భావించాల్సి ఉంటుందన్నారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, మరోవైపు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని సూచించారు. రోప్స్ సేవా సంస్థ ప్రతినిధులు రమేష్, ప్రభాకర్, తిన్మయి పాల్గొన్నారు. గురువారం నుంచి క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

ఇంటర్న్‌షిప్ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ డీఎస్టీ క్యూరీ ఏఐ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై వేసవి ఇంటర్న్‌షిప్ శిక్షణకు సంబంధించి పోస్టర్లను వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, ప్రొఫెసర్ వెంకటకృష్ణ, సుజాతమ్మ, ప్రొఫెసర్ వాణి, అధ్యాపకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ విద్యార్థులకు వాస్తవ ప్రపంచ సమస్యలపై పరిశోధన చేసే అవకాశం కల్పించేందుకు ఇంటర్న్‌షిప్ ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అధికారం మాది.. చెప్పింది చెయ్..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ అధికారులు సగటు సామాన్య ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నారు. కేవలం కూటమి పార్టీ నేతలు ఏం చెప్తే అది చేస్తున్నారు. కాదని ప్రవర్తిస్తే బెదిరింపులు.. కళ్లెదుటే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నా అధికారులు అడ్డుకోకూడదు.. తాగి వాహనం నడుపుతూ పట్టుబడినా కేసు రాయకూడదు.. అనుమతి లేకుండా వెంచర్ వేసినా అడగకూడదు.. ఇదీ చంద్రగిరి నియోజకవర్గంలోని పాకాలలో పరిస్థితి. దినదినగండం.. ప్రవర్తమానం అనేలా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

- పాకాలలో కూటమి నేతలకు ఎదురు చెప్పలేని దుస్థితి
- కళ్లెదుటే అన్యాయం జరుగుతున్నా అడ్డుకోలేకపోతున్న అధికారులు
- ప్రభుత్వం స్థలం ఆక్రమించవద్దని బోర్డు పెట్టలేని వైనం
- బోర్డు నాటకూడదు అంటూ బెదిరింపులు
- కూటమి నాయకులు, రియల్టర్ల ధాటికి బెంబేలెత్తిపోతున్న అధికారులు
- సెలవులో వెళ్లే యోచనలో మండల స్థాయి ఉద్యోగులు



ఇరంగారిపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్న వెంచర్

సాక్షి టాస్క్‌ఫోర్స్: ''అధికారం మాది .. మేము ఏం చెబితే అది చేయడమే మీ పని..కాదంటే బాగుండదు'' అనే ధోరణిలో కూటమి నాయకులు ప్రవర్తిస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ప్రభుత్వ అధికారుల పరిస్థితి దారుణంగా తయారైంది. కళ్లెదుటే అన్యాయం జరుగుతున్నా అడ్డుకోలేని దౌర్భాగ్య పరిస్థితి. సామాన్య ప్రజలకు న్యాయం చేయలేని దుస్థితి ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో ఇట్టే అర్థం అవుతోంది. కూటమి నేతల ఒత్తిడికి ఉద్యోగులు కంట తడి పెట్టలేక, ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించలేక తీవ్ర స్థాయిలో అవమానాలు ఎదుర్కొంటున్నారు. నేరాలు జరిగినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా తమను పోలీసులు అడగకూడదని, కేసులు పెట్టకూడదని దబాయిస్తున్నారు. తమ పార్టీ వారికే ఉపాధిహామీ పనులు మంజూరు చేయాలని అధికారులకు సూచనలు చేస్తున్నారు. టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వారు కాకుండా మరెవరూ ప్రభుత్వ కార్యాలయాలకు రాకూడదని.. ఇతరులు ఎందుకు వస్తారంటూ బహిరంగంగానే నిలదీస్తున్నారు. చెరువుల్లో మట్టి ఎత్తుతున్నారని సమాచారం ఇచ్చినా అధికారుల్లో చలనం రావడం లేదు. ఒకవేళ సంఘటనా స్థలానికి వెళ్లినా ఏమీ చేయలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వ నాయకులు ఆ స్థాయిలో దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. దీంతో చేసేది లేక ప్రస్తుతం పాకాలలో ఉన్న అధికారులు బదిలీ చేయించుకుని వెళ్లిపోవాలని చూస్తున్నారు. కొత్తగా అధికారులు పాకాలకు రావాలంటే భయపడుతున్నారు. ఎవరూ ఇక్కడకు రావడానికి సుముఖత చూపడం లేదు. దీంతో తహసీల్దార్, ఎంపీడీఓ పోస్టులతో పాటు మేజర్ పంచాయతీలైన పాకాల, దామలచెరువు ఈఓ పోస్టులను కూడా ఇన్‌చార్జులతోనే లాక్కొస్తున్నారు.



అక్రమంగా లేఅవుట్లు ..!

ఇరంగారిపల్లి పంచాయతీ పరిధిలో వేసిన వెంచర్‌లో పలు అవకతవకలు జరిగినట్లు స్థానిక ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సర్వేనంబర్ 1096లోని 2వ లెటరుతో పాటు మరికొన్ని సర్వేనంబర్లలో సుమారు 5 ఎకరాల 87 సెంట్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ వెంచర్ ఇప్పటి వరకు కన్వర్షన్ కాలేదని, అయితే కన్వర్షన్ కాకుండా వెంచర్ ఎలా చేస్తున్నారని స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్న ప్రశ్న. ఈ వెంచర్‌ను ఆనుకుని సర్వే నంబర్ 1097లో 1.10 ఎకరాల వంక పోరంబోకు ప్రభుత్వ స్థలం ఉండడం, దీన్ని కూడా ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. వంక పోరంబోకు ప్రభుత్వ స్థలాన్ని క్రమంగా పూడ్చుకుంటూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

బోర్డు సిద్ధం చేశారు కానీ..!

వంక పోరంబోకు ప్రభుత్వం స్థలం.. దాన్ని ఆక్రమించకూడదని రెవెన్యూ అధికారులు బోర్డును సైతం ఏర్పాటు చేశారు. అయితే అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో వెంచర్‌కు ఆనుకుని ఉన్న బోర్డును వంక బోరంబోకు ప్రభుత్వ స్థలంలో నాటలేకపోయారు. ఈ బోర్డును నాటడానికి వెళ్లిన తహసీల్దార్, మండల సర్వేయర్, వీఆర్వోలను కూటమి నాయకులు అడ్డుకున్నట్లు సమాచారం.



వంక పోరంబోకు స్థలంలో ఏర్పాటు చేసేందుకు తయారు చేయించిన బోర్డు

నోటీస్ బోర్డు

- టీటీడీ పరిపాలన భవనం ఆవరణలోని క్రీడా మైదానంలో ఉదయం 9 గంటల నుంచి టీటీడీ ఉద్యోగులకు క్రీడా పోటీలు
- ఎస్వీ వేద విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ఉదయం 10 గంటలకు ఆగమ సిద్ధాంతంపై అంతర్జాతీయ కార్యశాల
- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ మేళా నిర్వహణ
- శ్రీత్యాగరాజస్వామి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 నుంచి రాత్రి 9.30 వరకు త్యాగరాజ మండపంలో అన్నమయ్య సంకీర్తనోత్సవాలు
- ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేటీ రోడ్డులోని సప్తగిరినగర్, కమ్మసంఘం హాల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఇన్నర్ ఇంజినీరింగ్ కార్యక్రమం ప్రారంభం
- మహతి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవం
- లీలామహల్ సమీపంలోని చేపట మార్కెట్ ఎదురుగా ఉన్న ఆకృతి హాస్పిటల్లో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఉచిత గైనిక్ ల్యాప్రోస్కోపీ శిబిరం

అభ్యర్థులు వీరే..

తిరుపతి లీగల్: ఈనెల 28వ తేదీన జరగనున్న తిరుపతి న్యాయవాదుల సంఘం కార్యవర్గ పదవుల ఎన్నికలకు సంబంధించి బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసినట్టు ఎన్నికల అధికారి ఉషాకిరణ్ ప్రకటించారు. అధ్యక్ష పదవికి జి.గజేంద్ర, జి వెంకట కుమార్, ఉపాధ్యక్ష పదవికి జి.మధుసూదన్ రావు, మునయ్య, ఎస్.వినూత, ప్రధాన కార్యదర్శి పదవికి వసుమతి, వి.విద్యానాథరెడ్డి, మహిళా మెంబర్ పదవికి ఎస్‌జీ అరుణ, పి.కోమలాదేవి, పి.మంజుల ఉన్నారన్నారు.

వీసీగా స్థానికులనే నియమించాలి

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్ చాన్సలర్‌గా స్థానికులనే నియమించాలని, తక్షణం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని అఖిలపక్ష విద్యార్థి సంఘనాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించడంలో జాప్యం చేయడం సబబు కాదన్నారు. పూర్తి స్థాయి వీసీ లేకపోవడంతో వర్సిటీ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించిన ప్రభుత్వం ఎస్వీయూ విషయంలో నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి చొరవ చూపి స్థానికులను వెంటనే వీసీని నియమించాలని డిమాండ్ చేశారు. స్థానికేతరులను నియమిస్తే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్, ఎస్సీ, ఎస్టీ స్కాలర్స్ విభాగపు ఎస్వీయూ అధ్యక్షులు మురళీకృష్ణ, వైఎస్సార్ విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, మాదిగ జన సైన్యం వ్యవస్థాపకులు సుధాకర్ మాదిగ, రాష్ట్రీయ దళిత, విద్యార్థి సేన అధ్యక్షుడు యుగంధర్, భారతీయ దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేడీ ప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా సెక్రటరీ లోకేష్, బీసీవై పార్టీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు విక్రమ్, ఏపీ స్టూడెంట్ రైట్ యూనియన్ సెక్రటరి ముని, జేఏసీ ఎస్వీయూ అధ్యక్షుడు మల్చి ఉపేంద్ర, మాల విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుకుమార్, ఎస్టీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష విద్యార్థి సంఘం నాయకులు

ఈశ్వర్‌రెడ్డికి నివాళి

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం): రామచంద్రాపురం మండలం నెన్నూరుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఈశ్వర్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన విషయం విదితమే. బుధవారం ఈశ్వర్ రెడ్డి ఇంట జరిగిన కర్మక్రియలకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి హాజరయ్యారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ముందుగా ఈశ్వరరెడి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునే ఔదార్యం కలిగిన ఈశ్వర్‌రెడ్డి మరణించడం బాధాకరమన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ఆయన కర్మక్రియల్లో పాల్గొన్నారు.



ఈశ్వర్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

శ్రవణానందకరం.. సంకీర్తనల గానం

తిరుపతి కల్చరల్: త్యాగరాజ మండపంలో బుధవారం రాత్రి చెన్నైకి చెందిన ఎస్.ఐశ్వర్య, ఎస్.సౌందర్య అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా గానం చేసి సభికులను రంజింపజేశారు. శ్రీత్యాగరాజ స్వామి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ మండపంలో చేపట్టిన అన్నమాచార్య సంకీర్తనోత్సవాలు బుధవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా వీరు అన్నమయ్య కీర్తనల స్వలాపనతో భక్తులను అలరింపజేశారు. వీరికి మృదంగంపై కొత్తపల్లి రమేష్, ఘటంపై ఎల్.ప్రసాద్, వయోలిన్‌పై కొమండూరి కృష్ణ చక్కటి సహకారం అందించారు. కార్యక్రమంలో సాయంత్రం 4.30 గంటలకు కోనేరు లక్ష్మీరాజ్యం, కె.బాలాజీ బృందం ప్రదర్శించిన గాత్ర కచేరీ ఆకట్టుకుంది. అనంతరం నైవేలి రాజలక్ష్మి లయబద్ధంగా అన్నమయ్య సంకీర్తనలను గానం చేసి అలరింపజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ సుందరం, కంచి రఘురాం సంగీత గాయకులను ఘనంగా సత్కరించి అభినందించారు.



సంకీర్తనలు ఆలపిస్తున్న ఐశ్వర్య, సౌందర్య బృందం

మాదక ద్రవ్యాలపై అవగాహన



విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఈగల్‌క్లబ్ సభ్యులు

పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు అత్యంత ప్రమాదకరమని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంపై కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించి, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈగల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మాసులామణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ ముగింపు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో సత్యవేడుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు వర్సిటీలోని గృహవిజ్ఞాన శాస్త్రం, విజయవాహినీ చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ సంయుక్త సహకారంతో ఈనెల 17 నుంచి మూడురోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. శిక్షణలో ప్రాథమిక స్పోకెన్ ఇంగ్లిష్ నైపుణ్యాలు, పోషకాహార సంరక్షణ, సమాజ సమీకరణ, రికార్డుల నిర్వహణ, తల్లీశిశువు, చిన్నపిల్లలకు ఆహారం అందించే పద్ధతులు, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలతో సహా ఆట ఆధారిత పూర్వ బాల్య విద్య, బాల్య అనారోగ్య నివారణ, వ్యక్తిత్వ వికాసం, అనారోగ్యం, మరణాల నివారణ చర్యలు, ఆరోగ్య సంరక్షణ సేవలు మొదలైన వాటి గురించి సమర్థవంతంగా శిక్షణ ఇచ్చారు. శిక్షణాంశాల పుస్తకం, ఆచరణాత్మక భోదన, అనుభవంతో మమేకమైన కార్యక్రమాలు అంగన్‌వాడీ కార్యకర్తలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజిని, ప్రొఫెసర్ అరుణ, విభాగాధిపతి బిందు, న్యూట్రీషియన్ కేఎస్ సుబ్రమణ్యం, మెడికల్ కళాశాల వైద్యులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణాంశాల పుస్తకం విడుదల చేస్తున్న వర్సిటీ అధికారులు

12న హనుమాన్ శోభాయాత్ర

తిరుపతి కల్చరల్: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 12వ తేదీన సాయంత్రం 4 గంటలకు తిరుపతిలో హనుమాన్ విజయ యాత్ర భారీ బైక్ ర్యాలీలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బైక్ ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ హనుమంతుడి జీవితం హిందూ జాతికి ఆదర్శమన్నారు. హిందూ సమాజంలో ఎదురవుతున్న అనేక సవాళ్లను ఎదుర్కోవడానికి యువకుల్లో దేశభక్తి, దైవభక్తిని నింపాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో భజరంగ్‌దళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రతినిధులు

కలెక్టర్‌కు వీఆర్‌ఓల వినతి

తిరుపతి రూరల్: క్షేత్రస్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారులు పడుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నేతలు తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును కలసి బుధవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు కలిపి ఒకే వీఆర్‌వోను నియమించి మ్యాపింగ్ చేస్తున్నందున పని భారం పెరుగుతోందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ తప్పకుండా సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేశారు. తిరుపతి కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ హేమంత్, అసోసియేట్ అధ్యక్షుడు ప్రసాద్, కోశాధికారి భాస్కర్, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్‌కు సమస్యలను విన్నవించుకుంటున్న తిరుపతి జిల్లా వీఆర్వోల సంఘం నేతలు

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 63,487 మంది స్వామిని దర్శించుకున్నారు. 23,909 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.75 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లున్న వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



నటుడు ప్రభుదేవా, ఐవోసీ డైరెక్టర్ సతీష్ కుమార్

తిరుమల శ్రీవారిని బుధవారం ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు ప్రభుదేవా, ఐవోసీ డైరెక్టర్ సతీష్ కుమార్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

మట్టి అక్రమార్కులపై కేసు నమోదు



మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న సీఐ

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి–అలిపిరి మార్గంలోని దేవలోక్ వద్ద అక్రమంగా మట్టిని తోలుతున్న యంత్రంతో పాటు టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి మండల పరిధిలో మట్టి అక్రమ రవాణా అరికట్టాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలసి బుధవారం దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పేరూరు పంచాయతీ దేవలోక్ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వుతున్నారన్న సమాచారం రావడంతో.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాలను సీజ్ చేసి డ్రైవర్లు, కాంట్రాక్టర్ గిరిపై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా మట్టి అక్రమ రవాణా చేస్తున్న వారిపై సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ చిన్నగోవిందు తెలిపారు.

బీఎండీ ఉచిత పరీక్షలు

తిరుపతి తుడా: స్థానిక రెడ్డిఅండ్‌రెడ్డి కాలనీలోని శ్రీసాయిసుధా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత బీఎండీ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాల స్పెషలిస్ట్ డాక్టర్ సుకుమార్, ముంబైకి చెందిన ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ సిబ్బంది ఉచిత పరీక్షలు నిర్వహించి రోగులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ 45 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఎముకల సాంద్రత పరీక్షించుకోవాలన్నారు. ఎక్స్‌రే, బోన్ డెన్సిటీ టెస్ట్ పరీక్షలతో ఎముకల సాంద్రతను తెలుసుకుని క్యాల్షియం పరిమాణాన్ని సాధ్యమైనంతవరకు ఆహారం ద్వారానే భర్తీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, డాక్టర్ సుబ్బానాయుడు, డాక్టర్ హిమబిందు, ఫిజియోథెరపీ డాక్టర్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు డాక్టర్ సుకుమార్

పలువురికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న పదిమందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎన్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. అదేవిధంగా నగరంలో ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తూ రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు చేస్తున్న 21 మందికి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి సంధ్యారాణి తీర్పు చెప్పారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ట్రాఫిక్ డీఎస్పీల ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించి నేరాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

వైద్య సేవలను పటిష్టం చేయండి

తిరుపతి తుడా: ఆస్పత్రికి వచ్చే రోగులకు అందించే వైద్య సేవలను మరింత పటిష్టంగా అందించాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం సూచించారు. తిరుపతి రుయా, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో మహిళల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విభాగాధిపతులతో సమీక్షించారు. మహిళల్లో ఎదురయ్యే రొమ్ము క్యాన్సర్‌ను చేపట్టేందుకు ప్రసూతి ఆస్పత్రిలో మ్యామోగ్రామ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. వైద్యులు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. రుయాలో అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రుయా, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, డాక్టర్ పార్థసారథి, ఎస్వీ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర, చిన్నపిల్లల ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ మనోహర్, రుయా, ప్రసూతి ఆస్పత్రి సీఎస్‌ఆర్‌ఎంఓలు సుబ్బలక్ష్మమ్మ, ఆర్‌ఆర్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్, రుయా ఆస్పత్రి అడ్మిన్ ఆఫీసర్ కనకన రసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న డీఎంఈ డాక్టర్ నరసింహన్

కమిషనర్‌పై ఫిర్యాదు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్యపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచంద్రయ్యను బుధవారం అఖిలభారత అంబేడ్కర్ యువజన సంఘం నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగి లక్ష్మీదేవి ఉద్యోగోన్నతి అంశంపై సంఘం నేతలు కలిసిన కమిషనర్‌ను కలిసిన నేపథ్యంలో తమ పట్ల అనుచితంగా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక కోరతానని, ఇందుకు సంబంధించి పరిపాలన శాఖను ఆదేశించినున్నట్లు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు రామచంద్రయ్య హామీ ఇచ్చినట్లు పుణ్యమూర్తి మీడియాకు తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘం తెలంగాణ అధ్యక్షుడు వినయ్ కుమార్, నాగరాజు తదితరులు ఉన్నారు.